


చేనేతల మృతిపై ఎన్నెన్నో అనుమానాలు



తల్లిదండ్రులను కోల్పోయి దుఃఖంలో ఉన్న మృతుడు సుబ్బరాయుడు పెద్దకుమార్తె లక్ష్మీప్రసన్న



పాల వెంకటచలపతి పేరుతో ఉన్న పట్టాదారు పాస్‌బుక్కు

- పాల చలపతి పేరుతోనే పాస్‌బుక్కు టైటిల్‌డీడ్
- మరి ఆ భూమి ఏమైనట్లో...?
- రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉంది : తహసీల్దార్
- అప్పుల బాధతోనే ఆత్మహత్యలు : డీఎస్పీ షరీఫ్
- మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం
- ఫోన్‌లో పరామర్శించిన చంద్రబాబు

ఒంటిమిట్ట, మార్చి 24: నిండు ప్రాణాలకు వెలకట్టేది ఎవరు... చేనేతల మృతిపై ఎన్నో అనుమానాలు... ఎన్నో సందేహాలు నెలకొన్నాయి. బాధితులకు న్యాయం చేసేది ఎవరు..? ఈ ప్రశ్న ఇప్పుడు అందరిలో నెలకొన్న సందేహం. బాధితుల భూమికి సంబంధించి పాస్‌బుక్కు, టైటిల్‌డీడ్ వారి పేరుతోనే ఉన్నాయి. మరి ఆ భూమి వేరే వారి పేరుతో ఆన్‌లైన్ ఎలా అయింది... ఇందులో ఎవరెవరు ఉన్నారో నిర్ధారించాలని బాధితులు, స్థానికులు కోరుతున్నారు. పోలీసులు మాత్రం వారు భూమి కోసం ఆత్మహత్య చేసుకోలేదని, అప్పుల బాధతోనే చేసుకున్నారని చెబుతుండటం గమనార్హం.

మండలంలోని కొత్త మాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు, భార్య పద్మ, కూతురు వినయ



పాల సుబ్బారావు కుమార్తె లక్ష్మీప్రసన్నతో ఫోన్‌లో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు, చిత్రంలో జగన్‌మోహన్‌రాజు, అతికారి దినేశ్

ఆత్మహత్యకు పాల్పడ్డారు. తమ భూమి ఇతరుల పేరుతో ఆన్‌లైన్ అయిందని, ఆ భూమి తనకు దక్కదన్న నిరాశతో ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్‌లో వివరించారు. మరి బాధితుల మాట నిజమా.. విచారించే పోలీసుల మాట నిజమా, ఎవరి మాట నిజమనేది ఇప్పుడు అందరి మనసులను తొలుస్తున్న ప్రశ్న. మండలంలోని రెవెన్యూ అధికారులు హడావుడిగా పత్రికా ప్రకటనలు విడుదల చేశారు. పాల సుబ్బారావు కుటుంబానికి, వారి వారసులకు గానీ ఎలాంటి భూమి లేదని, సుబ్బారావు ఆరోపిస్తున్న భూమంతా ప్రభుత్వ భూమి అని తహసీల్దార్ వెంకటరమణ పేరుతో ప్రెస్‌నోట్‌ను స్థానిక రెవెన్యూ అధికారులు ఆదివారం విడుదల చేశారు. మరి 2015లో పాల చలపతి పేరుతో ఆన్‌లైన్ చేసింది ఎవరు..? చేయించింది ఎవరు..? అనంతరం ఆన్‌లైన్ నుంచి తీసిందెవరు అనే మాటకు మాత్రం సమాధానాన్ని అధికారులు చెప్పడం లేదు. పాల వెంకటచలపతి పేరుతో 1712 ఖాతా నెంబరులో పాసుబుక్కు, టైటిల్ డీడ్‌ను రెవెన్యూ అధికారుల రాజముద్రలతో కూడిన పాస్‌బుక్కును కుటుంబసభ్యులు చూపిస్తున్నారు. మరి రెవెన్యూ అధికారులకు తెలియకుండా పాస్‌బుక్కు ఎవరు ఇచ్చారు, ఎవరు దానిని తయారు చేశారు, తామే సంతకాలు చేశారా.. రెవెన్యూ అధికారులకు తెలియకుండా పట్టాదారు పాసుబుక్ సామాన్య ప్రజలకు ఎలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర స్థాయిలో సంచలనం కలిగించిన కేసును గంటల వ్యవధిలోనే తప్పుదోవ పట్టించి సమస్యను తుడిచివేసే విధంగా ప్రెస్‌మీట్ నిర్వహించడం పట్ల పోలీసులపై విమర్శలు వస్తున్నాయి. రోజూవారీ రెక్కల కష్టంతో జీవనసం సాగించే ఆ కుటుంబానికి 50 లక్షల రూపాయలు అప్పు ఇచ్చింది ఎవరు, అప్పు ఇవ్వడానికి ఇతడి దగ్గర కోట్ల రూపాయల ఆస్తి ఏమైనా ఉందా అనే మాటకు మాత్రం పోలీసుల నుంచి సమాధానం రావడం లేదు. కుటుంబాన్ని పోషించడమే కష్టమై ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబం 50 లక్షల రూపాయలు అప్పు చేసిందన్న మాట సామాన్య ప్రజలు కూడా నమ్మడం లేదు. అంత అప్పు చేయడం ఆ కుటుంబానికి సాధ్యమా మరి ఇంత డబ్బులు ఉంటే కుటుంబ పోషణ ఎందుకు ఇబ్బంది అవుతుందన్న ప్రశ్న అందరి నోటా వినబడుతోంది. 50 లక్షల రూపాయలు అప్పులు చేశారనే విషయాన్ని పోలీసులు చెబుతున్నా.. అప్పు ఎవరిచ్చారు.. ఎప్పుడు ఇచ్చారు అనే మాటకు మాత్రం విచారణ చేపడుతున్నాం అని చెబుతున్నారే తప్ప వివరాలు మాత్రం చెప్పడం లేదు. ఏది ఏమైనా పేద కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని.. ఆ కుటుంబానికి న్యాయం చేసే విధంగా ఇటు అధికారులు, అటు రాజకీయ నాయకులు ప్రయత్నించాలని.. అధికార పార్టీ నాయకులకు, అధికారులకు తలొగ్గి వాస్తవాలను తొక్కిపెట్టే విధంగా ప్రయత్నించవద్దని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు. కాగా ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలను బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో నిర్వహించారు. మృతదేహాలను చూసేందుకు మండల వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి దహన సంస్కారాల్లో పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

- మృతుల కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించిన చంద్రబాబు
- నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి

అధికార వైసీపీ భూదాహానికి బలైన చేనేతల కుటుంబ సభ్యులను టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కుటుంబం ఆర్థికంగా స్థిరపడేంత వరకు టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే వారికి అన్నివిధాలా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ వైసీపీ నాయకుల అరాచకాలు, భూకబ్జాలతో ఓ కుటుంబాన్ని బలి తీసుకున్నారన్నారు. పాల సుబ్బారావు మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, వైసీపీ నాయకులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

కుటుంబమే పోయింది... మా భూమి మాకు ఇప్పించండి

- లక్ష్మీప్రసన్న, పెద్ద కుమార్తె

మా కుటుంబం భూమి కోసం ఆత్మహత్యకు పాల్పడింది. ఆ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలి. మా తాత పేరుతో 3.10 ఎకరాలు ఉంది. అందుకు సంబంధించిన పాస్‌బుక్కు, టైటిల్‌డీడ్, దానికి సంబంధించిన కాగితాలు మా దగ్గరే ఉన్నాయి. మేము ఆరు సంవత్సరాల నుంచి భూమి కోసం తిరుగుతున్నాం. మా భూమి మాకు వచ్చే విధంగా న్యాయం చేయాలి. పీఎం కిసాన్ డబ్బులు కూడా రెండు సంవత్సరాలు మా అకౌంట్‌లో పడ్డాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి : తులసిరెడ్డి

మండలంలోని కొత్తమాధవరం గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని, ఘటనకు సంబంధించి విచారణను పారదర్శకంగా చేయాలని, ఘటనకు సంబంధించిన బాధ్యులు ఎంతటి నాయకులైనా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమిశెట్టి మనోహర్‌బాబు, చంద్రశేఖర్, సత్తార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఆర్డీవోలను సస్పెండ్ చేయాలి

- బాధితుల కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఏ.గఫూర్ డిమాండ్

కొత్త మాధవరంలో చేనేత కుటుంబాల ఆత్మహత్యల బాధితులను సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీపీఎం బృందం కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులు, స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల వద్ద ఉన్న రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. పాల చలపతి సోమశిల మునక ప్రాంత వాసి అని ఒంటిమిట్ట మండలం రెవెన్యూ పొలం సర్వే నెంబరు 2187/2లో, ఖాతా నెంబరు 1712లో 3.10 ఎకరాలను ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందని, పాస్‌బుక్, టైటిల్‌డీడ్ కూడా ఇచ్చారని తెలిపారు. 2015లో పీఎం కిసాన్ యోజన పథకం కింద లబ్ధిదారుడైన ఆ భూమిని అప్పట్లో ఒంటిమిట్ట తహసీల్దార్‌గా పనిచేసిన శిరీష, ఆర్డీవోగా పనిచేసిన వీరబ్రహ్మం కలిసి వైసీపీ నాయకుల భూకబ్జాలకు సహకరించి రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారని సీపీఎం నాయకులు తెలిపారు. మండలంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అనుచరుడు కట్టా నారాయణ, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అనుచరుడు సుబ్బారెడ్డిల వద్ద భారీగా ముడుపులు తీసుకుని సుమారు 600 ఎకరాలకు పైగా ఒంటిమిట్ట మండలంలోని రెవెన్యూ రికార్డులలో పేదల భూములు తొలగించి అనర్హులకు ఎక్కించారని ప్రజలు సీపీఎం బృందానికి చెప్పినట్లుగా వారు తెలిపారు. ఇందులో నిజానిజాలను కలెక్టర్ విచారణ వేసి తేల్చాలని, సీఎం జగన్ మోహన్‌రెడ్డి జిల్లాలో భూకబ్జా కారణంగా నిండు కుటుంబం ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన అధికారులను, తన సొంత పార్టీ నాయకులపై కేసు నమోదు చేయించి పేదల పక్షాన ఉన్నట్లుగా తన విశ్వసనీయతను నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఇలాంటి ఉదాంతాలు మరిన్ని జరిగే అవకాశం ఉందని, దీనికి బాధ్యత వైసీపీ ప్రభుత్వమే వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్మోహన్, అన్వేష్, దస్తగిరి రెడ్డి, కోనేటి నరసయ్య, సురేష్‌బాబు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

అప్పులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు : డీఎస్పీ

మండల పరిధిలోని కొత్తమాధవరం గ్రామంలో సంచలనంగా మారిన ముగ్గురు కుటుంబ సభ్యుల ఆత్మహత్య ఘటనపై ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ షరీఫ్, సీఐ పురుషోత్తంరాజుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తమాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడని, అందులో నష్టాలు రావడంతో పాటు క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పుల పాలయ్యాడని, ఆ కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డారని ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. కుటుంబ సభ్యులకు విషద్రావణం తాగించారని డాక్టర్లు నిర్ధారించారని.. విషద్రావణం ఏది అనేది ఫోరెన్సిక్ పరీక్షలో తెలుస్తుందన్నారు. భార్య కూతురుని చంపి సైకిల్‌పై ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ ప్రాంతానికి చేరుకుని తెల్లవారుజామున వెంకటాద్రి రైలు కింద పడ్డాడని జీఆర్పీ లోకో పైలట్ డ్రైవర్ తెలిపారని ఆయన అన్నారు. వారు రాసిన లేఖలో తొమ్మిది లక్షల అప్పులు ఉన్నాయని తెలిపారని, కానీ తమ విచారణలో దాదాపు 40 నుంచి 50 లక్షలు అప్పు ఉన్నట్లుగా గుర్తించామని.. అది ఎవరికి ఉన్నారనేది ఇంకా నిర్ధారణ చేయలేదన్నారు. కడప ఆర్డీవో రెవెన్యూ అధికారులు 3.10 ఎకరాల భూమి బాధితుడి పేరు మీద ఎక్కడా ప్రభుత్వ భూమి లేదని, వారి కుటుంబ సభ్యులకు పట్టా ఇవ్వలేదని రెవెన్యూ వారు విచారించి తమకు నివేదిక ఇచ్చారన్నారు. 2015 సంవత్సరంలో ఎవరినో పట్టుకుని భూమి ఆన్‌లైన్‌లో చేసుకున్నాడని.. అది కూడా రెండు వారాల అనంతరం మళ్లీ తీసివేశారని.. అంతే తప్ప రెవెన్యూ రికార్డుల్లో కానీ ప్రభుత్వపరంగా గానీ, ఎలాంటి డాక్యుమెంట్లు లేవని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులు ఆరోపించినట్లుగా పీఎం కిసాన్ డబ్బులు కూడా వారికి పడలేదని రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులు పరిశీలించి చెప్పారన్నారు. 2015లో ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ అధికారులపై విచారణ చేపడుతున్నారని, విచారణలో అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. సమావేశంలో ఎస్ఐ మధుసూదన్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ షరీఫ్

మల్లయ్యకొండకు నిప్పు అంటుకున్న దృశ్యం



మల్లయ్యకొండకు నిప్పు

- అగ్నికి ఆహుతైన పండ్ల తోటలు
- లబోదిబోమంటున్న రైతులు




అగ్నికి ఆహుతైన పండ్ల తోటలు

నిమ్మనపల్లి, మార్చి 24: మండలంలోని అగ్రహారం పంచాయతీ సమీపంలో ఉన్న మల్లయ్యకొండకు ఆదివారం నిప్పంటుకుని సమీపంలో ఉన్న మామిడి, సపోటా తోటలు కాలిపోయినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం కాస్తున్న ఎండలకు మధ్యాహ్నం నుంచి మల్లయ్యకొండకు నిప్పు అంటుకోవడంతో సమీపంలోని భూములలో రైతులు సాగు చేసిన పండ్లతోటలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. నిమ్మనపల్లి మాజీ సర్పంచ్ శ్రీరాములు 2 ఎకరాలలో వేసిన 400 వందల సపోటా, టేకు, మామిడి చెట్లు ధ్వంసం కాగా, మరో రైతు శేఖర్‌కు చెందిన జామకాలయ చెట్లు, అలాగే రైతు వీరయ్యకు చెందిన సపోటా చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. రైతులు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఒకసారి చెట్లు కాలిపోగా ఇప్పుడు మళ్లీ ఎండాకాలం రావడంతో కాలిపోయినట్లు తెలిపారు. వీటితో పాటు చెట్లకు తీసిన డ్రిప్‌పైపులు కూడా కాలిపోయినట్లు తెలిపారు. దాదాపు 5 మంది రైతులకు కలిపి రూ.5 లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. కాలిపోయిన పండ్లతోటలను అధికారులు పరిశీలించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

రాజంపేట ఎంపీ బరిలో కిరణ్‌కుమార్‌రెడ్డి

- ఊహాగానాలకు తెర
- ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం
- రైల్వేకోడూరు జనసేన అభ్యర్థిగా డాక్టర్ భాస్కర్‌రావు

రాయచోటి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన కూటమి తరఫున రాజంపేట పార్లమెంటు సీటును భారతీయ జనతా పార్టీకి కేటాయించారు. ఆ పార్టీ తరఫున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి బరిలోకి దిగుతున్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం రాష్ట్రంలో తమ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో గత కొన్ని రోజులుగా రాజంపేట పార్లమెంటు స్థానం విషయమై ప్రచారంలో ఉన్న ఊహాగానాలకు తెరపడింది. తొలుత రాజంపేట పార్లమెంటు స్థానానికి తెలుగుదేశం పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు కుమారుడు సుగవాసి బాలసుబ్రమణ్యంను తెలుగుదేశం పార్టీ తెరపైకి తెచ్చింది. చంద్రబాబు స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆయన నియోజకవర్గ వ్యాప్తంగా ముమ్మరంగా ప్రచారం చేశారు. అయితే టీడీపీ, జనసేన కూటమిలోకి బీజేపీ కూడా చేరడంతో ఒకసారిగా పరిస్థితి మారిపోయింది. ఈ స్థానాన్ని బీజేపీ కూడా ఆశించింది. దీంతో కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే తెలుగుదేశం పార్టీ తొలుత బీజేపీకి ప్రకటించిన ఆరు పార్లమెంటు స్థానాలలో రాజంపేట పేరు లేదు. అరకు, రాజమండ్రి, అనకాపల్లె, తిరుపతి, విజయనగరం, నరసాపురం పేర్లు వినిపించాయి. తర్వాత ఏమైందో? ఏమో విజయనగరం బదులుగా రాజంపేట స్థానాన్నే బీజేపీ కోరుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ప్రకటించిన టికెట్లలో రాజంపేటను మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి దక్కించుకున్నారు. ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ తరఫున ప్రచారంలో ఉన్న బాలసుబ్రమణ్యంకు పార్టీ ఏం అవకాశం కల్పిస్తుందో..? వేచి చూడాల్సిందే..



డాక్టర్ భాస్కర్‌రావు

రైల్వేకోడూరు జనసేన అభ్యర్థిగా డాక్టర్ భాస్కర్‌రావు

కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా రైల్వేకోడూరు స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ఆదివారం రాత్రి జనసేన పార్టీ తమ పార్టీ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. యనమల భాస్కర్‌రావును అభ్యర్థిగా ప్రకటించింది. పెనగలూరు మండలం నరసింగరాజపురానికి చెందిన ఇతను టీసీఎస్ కంపెనీలో సీఈవోగా పనిచేస్తున్నారు.

కిరణ్‌కుమార్ రెడ్డి వివరాలు

నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి: తండ్రి నల్లారి అమరనాథ రెడ్డి (మాజీ మంత్రి)

పుట్టిన తేదీ	: 13.9.1960 (హైదరాబాదులో)
విద్య	: ప్రాథమిక, మాధ్యమిక విద్య హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ బీకాం డిగ్రీ నిజాం కాలేజీ, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎల్ఎల్‌బీ
కుటుంబం	: భార్య: రాధికారెడ్డి, కుమారుడు: నిఖిలేష్ రెడ్డి, కుమార్తె: నిహారిక రెడ్డి
సోదరులు	: నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, సంతోష్‌కుమార్ రెడ్డి, సోదరి: గాయత్రి

రాజకీయం: తండ్రి మరణానంతరం 1989లో వాయల్పాడు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి విజయం, 1995లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి చేతిలో ఓటమి, 1999లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిపై గెలుపు. 2004లో టీడీపీ అభ్యర్థి ఇంతియాజ్ అహ్మద్‌పై గెలుపు. వైఎస్ హయాంలో ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఐదేళ్లు పూర్తిగా పనిచేశారు. 2009లో పీఆర్పీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిపై గెలుపు (టీడీపీ అభ్యర్థి ఇంతియాజ్), వైఎస్ హయాంలో 2009 నుంచి స్పీకర్‌గా కొనసాగింపు, వైఎస్ మరణానంతరం ఉమ్మడి ఏపీ 16వ చివరి ముఖ్యమంత్రిగా 25.11.2010 ప్రమాణస్వీకారం. రాష్ట్ర విభజన చట్టం అమల్లోకి రాగా 19.2.2014 ముఖ్యమంత్రి పదవికి రాజీనామా. 1.3.2014 వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగింపు. 1.3.2014 రాష్ట్రపతి పాలన విధింపుతో సీఎం పదవి నుంచి తప్పుకున్నారు. ఆ వెంటనే 10.3.2014న జైసమైక్యాంధ్ర పార్టీ (జైఎస్‌పీ) స్థాపన. తాను పోటీ చేయకున్నా ఏపీ రాష్ట్రంలో జేఎస్‌పీ పార్టీ అభ్యర్థులను అన్ని స్థానాల్లో పోటీ చేయించారు. ఒక్క చోట కూడా గెలవకపోవడంతో రాజకీయంగా తాత్కాలిక నిష్క్రమణ. 13.7.2018లో జేఎస్పీని రద్దు చేసి తిరిగి కాంగ్రెస్‌లో చేరిక. కాంగ్రెస్‌కు తిరిగి రాజీనామా చేసి 7.4.2023న బీజేపీలో చేరిక.



నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

27న మదనపల్లెకు చంద్రబాబు రాక



రాయచోటి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈనెల 27వ తేదీ బుధవారం మదనపల్లెలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మదనపల్లె పట్టణంలో రోడ్‌షో నిర్వహించనున్నారు. చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి మదనపల్లెకు వస్తారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు.

రుణాల కంతులు చెల్లించాలి

- టౌన్ బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్

మదనపల్లె, మార్చి 24: ఆస్తి తాకట్టు, బంగారంపై తీసుకున్న రుణాలను నెలవారీ కంతులు సక్రమంగా చెల్లించాలని టౌన్ బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్ కోరారు. స్థానిక ప్రధాన బ్యాంకు కార్యాలయంలో ఆదివారం ఈ ఆర్థిక ఏడాది రెండో సాధారణ మహాజన సభ సమావేశం నిర్వహించారు. గతంలో ఏడాది లోపు చెల్లించినా ఇబ్బంది లేకుండా ఉండేదని, ప్రస్తుతం ఆర్బీఐ నిబంధనల ప్రకారం ఏ నెలకు ఆ నెల కంతులు చెల్లించాలని సూచించారు. ఇలా చెల్లించడం వలన ఇతరులకు రుణ సదుపాయం కల్పించే అవకాశం ఉంటుందని, నిరర్థక ఆస్తులు తగ్గే అవకాశం ఉందన్నారు. గతంలో ఆస్తుల తాకట్టు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల హామీపై రుణాలు ఇచ్చేవారమని, ప్రస్తుతం అలా కాకుండా డైలీ లోన్లు, బంగారు నగలపై దినసరి రుణాలు మంజూరు చేస్తున్నట్లు సీఈవో ప్రకటించారు. ఇది చిరు వ్యాపారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రైవేటు, ఇతర వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలు అందించడంతో పాటు అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ ఏడాది జూన్ 24వ తేదీ నాటికి బ్యాంకు ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తవుతుందని, ఈ సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బ్యాంకు లావాదేవీలు, లాభాలు, రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాలను వివరించారు. అనంతరం ఖాతాదారుల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో మేనేజర్లు రవికుమార్, రమాదేవి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓవర్‌టేక్ చేయబోయి.. ఆర్టీసీ బస్సు ఢీకొని..

ఒకరు మృతి... మరొకరికి తీవ్ర గాయాలు




మృతి చెందిన యువకుడు అభిరామ్, ప్రమాదంలో గాయపడిన వెంకటేష్

రైల్వేకోడూరు, మార్చి 24: ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి, నెల్లూరు జిల్లా రాపూరు మండలం మల్లగుంటకు చెందిన అభిరాం (23) కొన్నేళ్లుగా స్థానిక తోట కన్‌సెషన్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం బైక్‌లో తిరుపతికి బయలుదేరాడు. లక్ష్మీ ప్యారడైజ్ సమీపంలో వెంకటేష్ అనే యువకుడు లిఫ్ట్ అడగడంతో అతనిని బైక్‌పై ఎక్కించుకున్నాడు. సిద్దేశ్వర సినిమా థియేటర్ సమీపంలో ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న కడప డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. దీంతో అభిరాం అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి.. సమాచారం అందుకున్న సీఐ టి. బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వెంకటేష్‌ను రైల్వే కోడూరు ఆస్పత్రికి, మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

రైల్వేకోడూరు, మార్చి 24: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రేణిగుంట రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ కథనం మేరకు... రైల్వేకోడూరు రైల్వేస్టేషన్ పాత గేటు వద్ద ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడు ధరించిన జీన్స్ ప్యాంటు, తెల్ల షర్టు ఊడిపోవడంతో నగ్నంగా ఉన్న మృతదేహం లభ్యమైందన్నారు. అతడు ప్రమాదవశాత్తూ రైలులోంచి జారిపడ్డాడా, లేక ఆత్మహత్య చేసుకున్నాడా అన్న వివరాలతో పాటు, అతని వ్యక్తిగత వివరాలేవీ లభ్యం కాలేదని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కువైత్‌లో గుండాపురం గ్రామవాసి మృతి

బ్రహ్మంగారిమఠం, మార్చి 24 : బ్రహ్మంగారిమఠం మండలంలోని చౌదరివారిపల్లె పంచాయతీ గుండాపురం గ్రామానికి చెందిన బిజివేముల రామసుబ్బారెడ్డి (47) అనే వ్యక్తి కువైత్‌కు వెళ్లాడు. గత నెల 16న పనిచేస్తూ భవనంపై నుంచి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయని బంధువులు తెలిపారు. అప్పటి నుంచి కువైత్‌లోనే చికిత్స పొందుతూ మార్చి 21న మరణించాడు. మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామమైన గుండాపురం గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.



రామచంద్రారెడ్డి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చెన్నూరు, మార్చి 24 : మండల కేంద్రమైన చెన్నూరు సమీపంలోని బుడ్డాయపల్లె వద్ద హైవే రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖాజీపేట మండలం దుంపలగట్టుకు చెందిన నలుగురు గాయపడ్డారు. దుంపలగట్టుకు చెందిన చాట్ల సుబ్బరాయుడు తన ఆటోలో పూలను వేసుకుని కడప నగరంలో విక్రయించుకునేందుకు బయల్దేరారు. ఆ ఆటోలో పూలు కోసిన మహిళలు ప్రమీల, వెంకటలక్షుమ్మ, నాగార్జున ఉన్నారు. చెన్నూరు బుడ్డాయపల్లె వద్ద ఓ ప్రైవేటు బస్సు ఆటోను ఢీకొనడంతో అందులో ఉన్న నలుగురు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్ల బాగోతం బయటపెట్టాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 24 : ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ.గఫూర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కడప జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇంతకాలం ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం ఎందుకు దాచి పెట్టారన్నది ఇప్పుడు అర్థమవుతోందన్నారు. తక్షణమే బాండ్ల బాగోతంపై దేశ ప్రజానీకానికి సమాధానం చెప్పాలని ఆయన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ఫండ్ పేరుతో సాగించిన మనీలాండరింగ్ సహా సకల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయని ఆయన అన్నారు. ఆధారాలతో పక్కాగా బయటపడిన అతి పెద్ద కుంభకోణం ఇదని, బీజేపీ, కాంగ్రెస్, టీఎంసీలే కాదు వైసీపీ, టీడీపీ, జనసేన కూడా ఈ బాండ్ల ద్వారా లబ్ధి పొందాయని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మనోహర్, రామ్మోహన్, శివకుమార్, ఐఎన్ సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అన్వేష్, సత్యనారాయణరెడ్డి, విద్యార్థి యువజన సంఘాల నాయకులు శివకుమార్, సునీల్, రాజేంద్రతో పాటు వివిధ మండలాల పార్టీ శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గఫూర్

డ్వామాలో.. డ్రామా

- ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా బదిలీలు
- పాత తేదీతో ఆర్డర్లు
- ఎదురు తిరిగిన సిబ్బంది
- సూసైడ్ చేసుకుంటా అనడంతో కలకలం

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ఈ నెల 16న వెలువడింది. ఆ రోజు మధ్యాహ్నం 3గంటల నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కోడ్ ఉన్నప్పుడు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే బదిలీలు చేపట్టాల్సి ఉంది. అయితే జగన్ పాలనలో అంతా రివర్స్. ఎన్నికల కోడ్ ఉన్నా డోంట్ కేర్. నాయకులనుకుంటే ఏమో అనుకోవచ్చు.. అధికారులు కూడా జగన్ పాలనకు బాగా కనెక్ట్ అయినట్లున్నారు. అందుకేనేమో ఎన్నికల కోడ్ ఉన్నా సరే.. కోడ్‌కే మస్కా వేసి పాత తేదీతో కావాల్సిన వారికి బదిలీలు చేసుకుని డ్రామా ఆడినట్లు చెబుతారు. ఉన్నపళంగా.. మ్యూచువల్ పేరుతో ఓ డీఏను బదిలీ చేశారు. అతను అడ్డం తిరగడంతో డ్వామాలో డ్రామా వ్యవహారం ఇప్పుడు బయటికి వచ్చింది. ఇప్పుడీ వ్యవహారం డ్వామాలో హాట్‌టాపిక్‌గా మారింది. డ్వామాలో ఇటీవలే బదిలీలు జరిగాయి. లాంగ్‌స్టాండ్‌లో ఉన్న వారందరినీ వేర్వేరు ప్రాంతాలకు బదిలీలు చేశారు.



ఈ నెల 20వ తేదీన చింతకొమ్మ దిన్నెల్లో విధుల్లో ఉన్న వెంకటేశ్వర్లు

పులివెందుల నేత సిఫారసుతో

నాలుగు నెలల క్రితం డ్వామాలో సాధారణ బదిలీలు జరిగాయి. ఒకేచోట దీర్ఘకాలికంగా పనిచేసిన వారిని ట్రాన్స్‌ఫర్ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇతర సిబ్బంది బదిలీలు సాగాయి. అయితే పులివెందులకు చెందిన ఒక ముఖ్య నేత సిఫారసుతో ఇప్పుడు సుమారు 20 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటరు ఆపరేటర్లు ఇతర వారిని బదిలీ చేయడం చర్చనీయంశంగా మారింది. ఈ నెల 16న ఎన్నికల కోడ్ వచ్చింది. అదే రోజు సాయంత్రం పులివెందుల నేత సిఫారసు మేరకు కమలాపురం, జమ్మలమడుగు, ఇతర ప్రాంతాల్లో 20 మందిని పిలిపించుకుని... 14వతేదీతో ఆర్డరు వేసి సంతకం చేసి ఆర్డరు కాపీలు ఇచ్చినట్లు చెబుతున్నారు. సాధారణంగా బదిలీల్లో మెయిలు, వాట్సప్ ద్వారా సమాచారం ఇస్తారు. కోడ్ వచ్చిన సాయంత్రం పూటే రిలీవ్ అయి జాయిన్ కావాలని చెప్పడం చర్చనీయాంశమైంది.

మ్యూచువల్ అట..

సీకేదిన్నెలో టెక్నికల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును మ్యూచువల్ పేరుతో కమలాపురానికి బదిలీ చేశారు. అతను మ్యూచువల్‌గా అప్లై చేసుకోనప్పటికీ మ్యూచువల్ పేరుతో బదిలీ చేశారు. కమలాపురం క్లస్టరు గ్రూపులో తనను అన్యాయంగా బదిలీ చేశారని ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత కూడా 14వ తేదీ వేసి, 16న ఫోను చేసి ఇచ్చారంటూ వాపోయారు. తాను 20వ తేదీ వరకు సీదిన్నెలోనే పనిచేస్తూ ఉన్నానని పేర్కొన్నారు. జరిగిన అన్యాయంపై కలెక్టరును కలిసి అనంతరం సూసైడ్ చేసుకుంటానంటూ ఆ గ్రూపులో పోస్టు చేశారు. ఈ వ్యవహారం సంచలనంగా మారింది. దీంతో వెంకటేశ్వర్లును ఖాజీపేటకు బదిలీ చేశారు. అయితే ఎన్నికల కోడ్ ఉండడంతో అక్కడున్న ఎంపీడీవో విధుల్లో చేర్చుకునేందుకు నిరాకరించారని అంటున్నారు.

అడ్డంగా దొరికేశారు

14వతేదీతో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు ఇచ్చారు. కొంత మంది రెగ్యులర్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించడానికి వెళ్లినప్పుడు గూగుల్ మ్యాప్‌లో లొకేషన్ షేర్ చేస్తూ ఫొటోలు తీస్తారు. డేట్, టైమింగ్ అవన్నీ ఫీడ్ అయి ఉంటాయి. వీరంతా 16వ తేదీ వరకు ఆయా మండలాల్లో పనిచేశారు. అయితే 14వ తేదీనే రిలీవ్ అయినట్లు ఆర్డర్లు ఇవ్వడాన్ని చూసి ఇదేంది ఇంత నిర్లక్ష్యమా అనుకుంటూ సిబ్బందే ఆశ్చర్యపోతున్నారు.

పులివెందుల నుంచి పొలిటికల్‌గా ఫోను వస్తే చాలు.. ఇంత అడ్డగోలుగా వ్యవహరిస్తారా అంటూ విమర్శిస్తున్నారు. ఇక డ్వామాలో ఓ ఉద్యోగి విజయవాడలో జీతం తీసుకుంటూ ఇక్కడ పెత్తనం చెలాయించడాన్ని కొందరు సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. డ్వామాలో జరుగుతున్న ఈ డ్రామాలన్నింటిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వీరు కోరుతున్నారు.

కూర్చుంటే కుదరదు..జనాలను తోలాలి

ఎమ్మెల్యే సమక్షంలో సీఎం జగన్ బస్సు యాత్రపై నాయకుల మధ్య వాగ్వాదం ?

మైదుకూరు, మార్చి 24 : సీఎం జగన్ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ఇస్తున్నాడులే అనుకుని ఈ ఎన్నికల్లో చేతులు ముడిచి కూర్చుంటే కుదరదు.. సీఎం జగన్ బస్సు యాత్రకు ఒక్కొక్క పంచాయతీ నుంచి కనీసం 300 మంది జనాల్ని తీసుకురావాలి.. ఆ బాధ్యత నాయకులతో పాటు గృహ సారథులదే అంటూ అధికార పార్టీ నేత హుకుం జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మేము జనాల్ని తరలించాలంటే చాలాకష్టంతో కూడుకుంది. ఇప్పటి వరకు ఖర్చులు పెట్టుకుని ఈ ఎన్నికల సమయంలో కూడా మేమే ఖర్చు పెట్టుకోవాలంటే కుదరదంటూ నాయకుల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... ఈనెల 27న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రొద్దుటూరులో సిద్ధం బస్సు యాత్ర చేపట్టనున్నారు. ఆ బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి రెండు రోజులుగా మైదుకూరులోని పార్టీ కార్యాలయంలో ఆయా మండలాలకు చెందిన నాయకులను పిలిపించి ఒక్కొక్క మండలం నుంచి కనీసం 5 వేల మందిని జన సమీకరణ చేపట్టాలని ఆయా మండలాల నాయకులకు హుకుం జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో బి.మఠం, మైదుకూరు మండలాలకు చెందిన నాయకులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో బి.మఠం నుంచి ఎంపీపీ వీరనారాయణరెడ్డి, జడ్పీటీసీ రామగోవిందరెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. జనసమీకరణలో కనీసం ఒక్కొక్క పంచాయతీ నుంచి 300 మందిని తీసుకరావాలంటూ వీరనారాయణరెడ్డి పేర్కొనగా, దిరసవంచకు చెందిన వైసీపీ నేత మోహన్‌రెడ్డి ఇన్నాళ్లకు మేము గుర్తు కొచ్చామా.. అప్పుడంతా స్వయంగా లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టుకొని సర్పంచ్, ఎంపీటీసీలను గెలిపించుకున్నాం. ఈమధ్య కాలంలో నాకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇప్పుడు సిద్ధం సభకు జనాన్ని పిలుచుకువచ్చేందుకు మేము కనపడ్డామా.. ఆ ఖర్చు కూడా మేమే పెట్టుకోవాలా, అలా చేయలేం. ఎన్నికల సమయం ఇది. ఖర్చులు మీరే పెట్టుకోడంటూ పేర్కొనడంతో వీరనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎమ్మెల్యే ఇద్దరిని సముదాయించి, వాగ్వాదం సద్దుమణిగేలా చేశారు. కాగా మోహన్‌రెడ్డి కొంతకాలం నుంచి వీరనారాయణరెడ్డితో అసమ్మతిలో ఉన్నట్లు, టీడీపీలోకి వెళ్లే ఆలోచనలో ఉండటంతో జడ్పీటీసీ గోవిందరెడ్డి మోహన్‌రెడ్డిని సముదాయించి సమావేశానికి తీసుకువచ్చినట్లు తెలిసింది. అయితే అక్కడ మళ్లీ వీరానారాయణరెడ్డికి, మోహన్‌రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 24: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనే 33 శాఖల ఉద్యోగులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కల్పించిందని జిల్లా ఎన్నిల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో విధుల్లో ఉంటూ పోలింగ్ రోజున ఓటు వేయలేని 33 శాఖల ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించిందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం-12 డీలను అందుబాటులో ఉంచాలని ఎన్నికల సంఘం పేర్కొందని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు వీరికే...

రైల్వే ప్రయాణికులు, సరుకు రవాణా సేవలు చేసే ఉద్యోగులు, మెట్రో, మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలిగ్రామ్, దూరదర్శన్, ఆలిండియా రేడియో, రాష్ట్ర మిల్క్ యూనియన్, ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్ని మాపక సేవలు, ట్రాఫిక్ పోలీసు, అంబులెన్సు, షిప్పింగ్, ఫైర్ ఫోర్సు, జైళ్లు, ఎక్సైజ్, వాటర్‌శాఖలతో పాటు ట్రెజరీ, అటవీ, సమాచార, పోలీసు, హోంగార్డులు, ఆహార సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ఎనర్జీ(పవర్), ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, పీడబ్ల్యూడీ, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్స్, విపత్తు నిర్వహణ శాఖల ఉద్యోగులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై 193 ఫిర్యాదులు పరిష్కారం

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద అందిన 194 ఫిర్యాదుల్లో 193 పరిష్కరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. ప్రింట్ మీడియా ద్వారా 45 ఫిర్యాదులు, మానిటరింగ్ సీఈవో యాప్ ద్వారా 23, జిల్లా కాల్‌సెంటర్ నుంచి 3, ఎన్‌జీఎస్‌పీ ద్వారా 3, సిటిజన్ యాప్ ద్వారా 104 ఫిర్యాదులు అందాయన్నారు. సోషల్ మీడియా ద్వారా 7, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా 5, ఆన్‌లైన్ ద్వారా 4 ఫిర్యాదులు వచ్చినట్లు ఆ ప్రకటలో తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి

ఓబులవారిపల్లె, మార్చి 24: గుర్తు తెలియని వాహనం ఢీకొని మంగంపేట దగ్గర ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపిన వివరాల మేరకు.. పోలూరు నాగేశ్వర్‌రెడ్డి(37) రైల్వేకోడూరు మండలం రాఘవరాజుపురం గ్రామం నుంచి రాయచోటిలోని బంధువుల దినం కార్యక్రమానికి వెళ్లే క్రమంలో మంగంపేట పరిధిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రాన్ని మాఫీయాంధ్రప్రదేశ్‌గా మార్చారు

మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప(కలెక్టరేట్), మార్చి 24: రాష్ట్రంలో జగన్ మాఫియా పాలన సాగుతోందని, నమ్మిఓట్లు వేసినందుకు గంజాయి, డ్రగ్స్ మత్తు మందులతో యువత జీవితాలను నాశనం చేసే కుట్ర జరుగుతోందని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి జగన్ సర్కారుపై నిప్పులు చెరిగారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో తులసి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీరాములతో కలసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌పాలనలో లాండ్ మాఫీయా, శాండ్ మాఫియా, మద్యం మాఫియా, మైనింగ్ మాఫీయా, ఎర్రచందనం మాఫీయా, ఎర్రమట్టి మాఫియా, సబ్సిడీ బియ్యం మాఫీయాతో పాటు యువత జీవితాలను బుగ్గిపాలు చేసే డ్రగ్స్, గంజాయి మాఫీయాలతో రాష్ట్రం మాఫీయాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. విశాఖ, అరకు ప్రాంతాల్లో టీ ఆకు పంటలకు ఫేమస్ అన్నారు. అక్కడ కూడా గంజాయి సాగు జరుగుతుండంతో దేశంలో అనేక రాష్ట్రాలకు తరలి పోతుందన్నారు. పూర్వం కొందరు పెద్దలు మాత్రమే గంజాయి మత్తుకు బానిసలయ్యారు... నేడు జగన్ పాలనలో స్కూలు విద్యార్థులు కూడా గంజాయి మత్తుకు బానిసలుగా మారుతుండటం బాధాకరమన్నారు. జిల్లాలో వైసీపీ నేతల భూదాహానికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు. కొత్త మాధవరంలో చేనేత కార్మికుడు సుబ్బారావుతో పాటు భార్య, కుమార్తెల ఆత్మహత్యలకు పాల్పడటానికి వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులే కారణం అన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 28వ తేదీ కడపలో పెద్ద దర్గా వద్ద ఇఫ్తార్ విందులో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఏ సత్తార్, వెంకటరమణారెడ్డి, పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ధ్రువకుమార్‌రెడ్డి, మహ్మద్ అలీఖాన్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడు మృతి

ఓబులవారిపల్లె, మార్చి 24: మండలంలోని గాడెల గ్రామానికి చెందిన వంగినేని ఆంజనేయులు కుమారుడు వంగినేని శివశంకర (26) అప్పుల బాధ తాళలేక మృతి చెందినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. పంటలు సాగు చేయడం వల్ల అప్పులు కావడంతో గడ్డి మందు ద్రావణం సేవించడంతో గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కొరకు తిరుపతి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజల ఆలోచనాధోరణి మార్చడానికే 'విపశ్యన'

స్వర్గీయ వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత

పులివెందుల, మార్చి 24: ప్రజల ఆలోచన ధోరణి మార్చడానికి తన వంతుగా ఏదైనా చేయాలనే ఆలోచనతో విపశ్యన ధ్యాన శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశామని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ వైఎస్ సునీత అన్నారు. ఆదివారం పులివెందుల పట్టణంలోని విపశ్యన ధ్యాన శిక్షణ కేంద్రంలో భర్త రాజశేఖర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాన్న చనిపోయిన తర్వాత అనుకోని పరిణామాలు చోటుచేసుకున్నాయన్నారు. ఏం చేయాలి అని ఆలోచిస్తున్న సమయంలో కొంతమందితో మాట్లాడడం, ప్రజల ఆలోచన ధోరణి ఎలా మార్చాలి, మార్చడం కుదురుతుందా అని ఆలోచించేవారమన్నారు. కొందరు పోలీసు అధికారులను కలిసి మాట్లాడడం జరిగిందన్నారు. వీళ్లని మార్చలేమనే అభిప్రాయాలు వారు వ్యక్తం చేసినపుడు, నేను సంఘర్షణ పడుతున్న సమయంలో విపశ్యన ధ్యాన కేంద్రం గుర్తుకు వచ్చిందన్నారు. విపశ్యన ద్వారా ఇంప్రూవ్ అయిన తీహార్ జైలు గురించి తెలుసుకున్నానన్నారు. దీంతో మన ఊరిలో ప్రజలు ఆలోచనాపరంగా కొంత ఇంప్రూవ్ అయితే బాగుంటుంది కదా అని ఆలోచించామన్నారు.

తప్పు తెలుసుకోవాలన్నదే నా కోరిక

ఏదైనా తప్పు చేసిన వాళ్లు, జైలుకెళ్లిన వాళ్లు ఆ తప్పును తెలుసుకోవాలన్నారు. జైలు అంటే చేసిన తప్పు తెలుసుకొని మార్పు చెందే ఒక రీహాబిలిటేషన్ కేంద్రం లాంటిదన్నారు. కానీ చాలామంది తప్పు తెలుసుకోకుండా అంతకుమించిన క్రిమినల్ మైండ్‌తో వస్తుంటారన్నారు. తీహార్ జైల్లో జైలుకు వచ్చిన వారి కోసం కిరణ్‌బేడి విపశ్యన శిక్షణను పరిచయం చేశారన్నారు. అక్కడ వారికి రీహాబిలిటేషన్ కేంద్రంగా ఉండేదన్నారు. అలాగే కడపలో కూడా ఒకటి రెండుసార్లు నడిచిందన్నారు. అలా కంటిన్యూ చేయాలన్నది నా కోరిక అన్నారు.

20 ఎకరాల్లో ఏర్పాటు

పులివెందులలో 20 ఎకరాలలో ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ధ్యాన శిక్షణ పొందే వారి కోసం అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. కేంద్రం గురించి ఆమె వివరిస్తూ ప్రస్తుత విద్యార్థి జీవితం చాలా స్ట్రెస్‌తో కూడుకున్నదన్నారు. ఆ స్ట్రెస్‌ని డీల్ చేయడం ఒక మేజర్ టెక్నిక్, సెల్ఫ్ అవేర్‌నెస్, సెల్ఫ్ రియలైజేషన్ అయ్యేందుకు విపశ్యన నేర్పుతుందన్నారు. ఇక్కడ నేర్పే పద్ధతులతో మన మైండ్, బాడీని కంట్రోల్ చేసుకునేందుకు హెల్ప్ అవుతుందన్నారు. పది రోజులు చేసి విడిచిపెట్టేది కాదన్నారు. ప్రతి సంవత్సరం చేయాలన్నారు. ఏం పని చేసినా ఇంకా బాగా చేయగలిగే స్థితికి తెస్తుందన్నారు. జీవితంలో మీరు ఏ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా విపశ్యన శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. మాజీ రాష్ట్రపతులు ప్రతిభాపాటిల్, రామ్‌నాథ్‌కోవింద్, అరవింద్ కేజ్రీవాల్, రాహుల్‌గాంధీ, చంద్రబాబునాయుడు వీళ్లందరు కూడా విపశ్యన టెక్నిక్స్ తెలుసుకున్న వారే అన్నారు. విపశ్యన శిక్షణకు అటెండ్ కావడానికి మహారాష్ట్ర ప్రభుత్వం పదిరోజుల పాటు సమయం ఇస్తారన్నారు. ఇది ఏ ఒక్క మతానికి సంబంధించినది కాదన్నారు. ఇది మనల్ని మనం ఎలా ఇంప్రూవ్ చేసుకోవచ్చు అనే విషయాన్ని తెలుసుకునేందుకే విపశ్యన శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఇంతకుముందు ఆంధ్రప్రదేశ్‌లో కూడా విపశ్యన శిక్షణ ఇచ్చేవారన్నారు. ఆరోగ్యపరంగా చాలా మంది బయటపడ్డారన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సునీత

విపశ్యన కేంద్ర నిర్వాహకులు నందకిషోర్ మాట్లాడుతూ విపశ్యన అనేది ఒక ప్రాచీనమైనదన్నారు. రుగ్వేదంలో ప్రస్తావించిందన్నారు. 2500 సంవత్సరాల క్రితం గౌతమబుద్ధుడు దీనిని తిరిగి కనుగొని ప్రజలకు అందజేశారన్నారు. పశ్యన అంటే చూడడం విపశ్యన అంటే విశేషంగా చూడడం అన్నారు. ఉన్నది ఉన్నట్లుగా ఒక భావం తలెత్తగానే అది మన శరీరం మీద ఎలా ప్రభావం చూపుతుంది.. ప్రభావితమైన శరీరం తిరిగి మనసులో ఉన్న ఈ భావనను ఎలా తీవ్రం చేస్తుంది.. అలా మన మనసులో ఏర్పరచుకున్న భావాలన్నీ స్వభావంగా ఎలా మారుతాయి, వాటి నుంచి ఎలా బయటపడతారనేది ఈ ధ్యానంలో నేర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ విపశ్యనలో పది రోజుల పాటు ఇక్కడే ఉంటూ ఉదయం 4 గంటల నుంచి రాత్రి 9 గంటలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పదిరోజుల్లో అంచలంచెలుగా ఈ విద్య నేర్పించడం జరుగుతుందన్నారు. ఇందులో మొదటి మూడు రోజులు ఆనాపానసాతి గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆనా అంటే లోనికి వచ్చే శ్వాస, అపాన అంటే బయటకు వెళ్లే శ్వాస, సాతి అంటే గమనించడం అన్నారు. శ్వాసను గమనించడం వల్ల మనసును తేలికగా ఉంచుకోవచ్చన్నారు. మిగిలిన ఏడు రోజుల్లో విపశ్యన టెక్నిక్స్ నేర్పించడం జరుగుతుందన్నారు. తద్వారా మనిషి తనను తాను మార్చుకొని అంచెలంచెలుగా ఎదిగేందుకు విపశ్యన టెక్నిక్స్ ఉపయోగపడుతాయన్నారు. 20ఏళ్లకు పైబడిన వాళ్లు ఎవరైనా చేరవచ్చు అన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తైన వారు మిగిలిన వారికి ఈ శిక్షణ దక్కాలనే ఉద్దేశంతో సహాయ సహకారాలు అందిస్తుంటారన్నారు. స్వచ్ఛందంగా దానం ఇస్తారన్నారు. అలా పాత సాధకులు ఇచ్చిన దానంతో తర్వాతి శిక్షణ మొదలవుతుందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ధమ్మ.ఓఆర్‌జి అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు అన్నారు. వచ్చే నెల నుంచి 15 నుంచి 19ఏళ్ల లోపు వారికి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. వీరికి ఏడురోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలాంటటి ఒక విద్య చిన్నతనంలోనే అలవర్చుకుంటే సరైన జీవితం ఎలా జీవించాలో తెలుసుకోవచ్చు అన్నారు.

గుంటూరు నుంచి వచ్చి శిక్షణ పొందిన సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుతమున్న అన్ని సమస్యలకు విపశ్యన శిక్షణతో పరిష్కారం లభిస్తుందని నాకు అనుభవం ద్వారా తెలిసిందన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఉపయోగించుకొని జీవితాన్ని అద్భుతంగా మలచుకోవాలన్నారు. ఇపుడు ఎక్కువగా మానసిక వ్యాధులే అన్నారు. ఉరుకు పరుగుల జీవితంలో తీవ్ర ఒత్తిడికి లోనై ఆ ప్రభావాన్ని కుటుంబంపై చూపి ఎవరు కూడా మనశ్శాంతి లేకుండా జీవిస్తున్న పరిస్థితులను ఈరోజు సమాజంలో చూస్తున్నామన్నారు. విపశ్యన చేసిన వాళ్లు ఈ సమస్య తాత్కాలికమైనదే అనే భావనతో ఉంటారన్నారు. మానసిక వ్యాధిబారిన పడిన నా స్నేహితుడు సాధారణంగా తయారయ్యాడన్నారు. ప్రతి ఒక్కరు అనుభవం ద్వారా తెలుసుకోవాలన్నారు.

హైదరాబాద్ నుంచి వచ్చి శిక్షణ పొందిన రాజేశ్వరి మాట్లాడుతూ ఇక్కడ నేర్పిన టెక్నిక్స్ ద్వారా చాలా ప్రశాంతమైన జీవితం లభించిందన్నారు. అందుకే మళ్లీ మళ్లీ విపశ్యన శిక్షణ తీసుకుంటున్నా అన్నారు. ఎన్ని ఇంగ్లీష్ మందులు వాడినప్పటికీ తాత్కాలికమే అన్నారు. మనసును ప్రశాంతంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నది విపశ్యన ద్వారా తెలియవచ్చిందన్నారు.

చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేద్దాం



టీడీపీ కార్యకర్తలతో రాంప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె మార్చి 24; సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రి చేద్దామని రాయచోటి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాదురెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం బి యర్రగుడి పంచాయతీ కాపు పల్లెలో యర్రగుడి, బీఏ నాగిరెడ్డిపల్లె, కాపుపల్లెల్లో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు, ఇసుక దందా, భూ ఆక్రమణలు అధికమయ్యాయన్నారు. తెలుగుదేశం పార్టీని గెలిపించడం ద్వారా వీటికి అడ్డుకట్ట వేయాలన్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ప్రతి ఒక్కరు సైనికుడిలా పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు తోపిరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, యర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరామరాజు, చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు,

డ్రగ్, భూ మాఫియాలను పోషిస్తున్న జగన్

రాయచోటి టౌన్ 24; రాష్ట్రంలో డ్రగ్, ,భూ మాఫియాలను జగన్ ప్రభుత్వం పెంచి పోషిస్తోందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటిలోని టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలో వచ్చినప్పటి నుంచి ల్యాండ్, శాండ్, మద్యం, డ్రగ్ ,మాఫియాతో పాటు, వైసీపీ నాయకుల అక్రమాలు దోపిడీలు ఎక్కువయ్యాయన్నారు. దీంతో వైసీపీ బడా నాయకులు బాగుపడ్డారే తప్ప ప్రజలకు మేలు జరిగిన దాఖలాలు లేవన్నారు. అన్యాయాలు , అక్రమాలు, రౌడీయిజం, దౌర్జన్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ఈ అరాచక పాలనకు తొందరలో ప్రజలు చరమగీతం పాడుబోతున్నారన్నారు. టీడీపీ హయాంలో పెట్టుబడుల్లో ప్రథమ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను జగన్‌రెడ్డి గంజాయి, డ్రగ్స్‌తో నెంబర్ వన్ స్థాయికి తీసుకువచ్చానన్నారు. కల్తీ మద్యంలో లక్షల మంది పేదవారిని ఈ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బేస్ క్యాంపుల పరిశీలన



డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేసును వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

సిద్దవటం, మార్చి 24 : సిద్దవటం మండలం అటవీ ప్రాంతంలోని రోళ్లపోటు బేస్ క్యాంపు, పంచలింగాల వద్ద సీసీ కెమెరాలను ఆదివారం ప్రిన్సిపల్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి, సీసీఎఫ్ రామకృష్ణ, డీఎఫ్‌వో నాగార్జున్‌రెడ్డి పరిశీలించారు. ఎర్రచందనం మొక్కలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేసు, అటవీ సిబ్బంది, దీపిక హైమావతి పాల్గొన్నారు.

ఏపీ మోడల్ కాలేజీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం మార్చి 24: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మండల పరిధిలోని ఏపీ మోడల్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ అప్రోజ్‌బేగం ఒక ప్రకటనలో తెలిపారు ఈ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు న్నాయని ఆమె తెలిపారు. ఈ ఏడాదిపదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు అర్హులని తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



మృతులకు నివాళులర్పిస్తున్న జనసేన నేత అతికారి దినేష్



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న చమర్తి కుమారుడు

రైల్వేకోడూరు, మార్చి 24: వైసీపీ భూదాహానికి బలైన కుటుంబాన్ని వెంటనే ఆదుకోవడంతోపాటు, అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడ నుంచి ఆయన మాట్లా డుతూ మాధవరంలో చనిపోయిన రైతు కుటుంబానికి వెంటనే సాయం అందాలని, రెవెన్యూ అధికారులు తప్పుడు ఆన్‌లైన్‌ను సరి చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, రైతులు, సామాన్య ప్రజలు చనిపోయారని గుర్తు చేశారు. ప్రజల్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే ప్రజల్ని చంపుతుంటే ఇంత కంటే దారుణమైన సంఘటనలు ఏ ప్రభుత్వంలో జరగలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలంటే టీడీపీని గెలిపించాలని తెలిపారు. బాధిత కుటుంబాన్ని వెంటనే ఆదుకోకపోతే ఆందోళనలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

ఓబులవారిపల్లె : ప్రభుత్వ, రెవెన్యూ అధికారుల ధన దాహానికి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జయరామయ్య అన్నారు. పచ్చని కుటుంబాన్ని బలితీసుకున్న రెవెన్యూ అధికారులను, అధికార పార్టీ నాయకులను ఏం చేయాలన్నారు. రైతు సుబ్బారావు, వారి కుటుంబ సభ్యుల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులను వెంటనే శిక్షించాలన్నారు. లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటున్న ఉద్యోగులు, అధికారులు ముగ్గురు ప్రాణాలు పోవడానికి కారకులయ్యారన్నారు. ప్రభుత్వం వెంటనే వారికి న్యాయం చేస్తూ ఇబ్బందులు కలిగించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైసీపీ హత్యా రాజకీయాలు

ఒంటిమిట్ట : ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో పేదల భూములు కొట్టేస్తూ వైసీపీ ప్రభుత్వం హత్యా రాజకీయాలకు పాల్పడుతోందని జనసేన పార్టీ నేత అతికారి దినేష్ ఆరోపించారు. మండలంలోని కొత్తమాధవరం గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడిన వారి మృతదేహాలను ఆదివారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భూమి ఆన్‌లైన్‌లో మరొక పేరుతో ఉండటం, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా దానిని తనపేరుపై మార్చడంలో నిర్లక్ష్యం చేయడం సుబ్బారావు కుటుంబాన్ని బలి తీసుకుందన్నారు. అమెరికాలో ఉన్న కట్టా శ్రావణి పేరుతో భూమి ఎలా వచ్చిందన్న విషయంలో నిజానిజాలు బయటికి రావాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేంత వరకు తాము అండగా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు గంజి సుబ్బరాయుడు, కిరణ్ స్వామి, పుత్తా రామచంద్రయ్య, వీరాంజనేయరెడ్డి, కరెంటు రమణ, ఈశ్వరయ్య, ఆలూరి వెంకటసుబ్బయ్య, డాక్టర్ వీరభద్రుడు, చలపతి చంద్ర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చమర్తి పరామర్శ

ఒంటిమిట్ట: రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు, కుమారుడు చమర్తి లోకేష్‌కుమార్‌రాజు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైసీపీ నాయకులు ఓర్వలేక తప్పును కప్పిపుచ్చుకునేందుకు టీడీపీపై అభాండాలు మోపుతున్నారని వైసీపీ ప్రభుత్వంలో పేద ప్రజలకు బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సుబ్బారావు కుమార్తెకు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని టీడీపీ జనసేన పార్టీ నాయకులు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. టీడీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, శివారెడ్డి, మోదుగుల నరసింహులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పరామర్శించారు. వైసీపీ నాయకుల ఆగడాలు రాష్ట్రంలో శృతిమించిపోయాయని, ఆవారి భూమి వారికి అప్పగించే వరకు సీపీఐ అండగా ఉంటుందని, వారి కుమార్తెకు ప్రభుత్వ భూమితో పాటు ప్రభుత్వ ఉద్యోగాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

క్షయ వ్యాధి బాధితులను ఆదరిద్దాం



రాజంపేటలో ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో, వైద్య సిబ్బంది



లక్కిరెడ్డిపల్లె: మూడు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

రాజంపేట, మార్చి24 : వరల్డ్ టీబీ డే సందర్భంగా ఆదివారం డిప్యూటీ డీఎంహెచ్‌వో చెన్నకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా ఆసుపత్రి నుంచి కొత్తబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. టీబీపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాజంపేట ఆర్డీవో టి.మోహన్‌రావు వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం వైద్య సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీ మెడికల్ ఆఫీసర్లు శరత్‌కమల్, అశ్విని చంద్ర, స్నేహలత, అశోక్, టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్, సిద్ది రామయ్య, సూపర్‌వైజర్స్ ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: క్షయ వ్యాధి బాధితులను ఆదరించాలని ఎంటీసీ వైద్యాధికారి డాక్టర్ సిద్దయ్య సూచించారు. ప్రపంచ క్షయవ్యాధి దినం సందర్భంగా ఆదివారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం రావడం, బరువు తగ్గడం, నొప్పులు, దగ్గినపుడు గళ్లలో రక్తం పడడం, ఆకలి లేకపోవడం, ఇలాంటి లక్షణాలు ఉన్నవారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలోఫర్‌బేగం, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వై ప్రసాదుయాదవ్, టీబీ సూపర్‌వైజర్ హరి, మణి, ఏఎన్ఎంలు జవహర్, పుష్పవతి, ఏఎస్ఏ సునీల్ పాల్గొన్నారు.

ఎండలు బాబోయ్..ఎండలు!

• పెరిగిన సూర్య ప్రతాపం • తల్లడిల్లుతున్న ప్రజలు • శీతలపానీయాలకు డిమాండ్



నిర్మానుష్యంగా ప్రధానదారి



కొబ్బరి బొండాలు తాగుతున్న జనం

రైల్వేకోడూరు, మార్చి 24: ఎండలు ముదిరాయి. సూర్యుడు తన ప్రాతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 7 గంటలకే వేడి ప్రారంభం అవుతోంది. . మరో కోనసీమ అని రైల్వేకోడూరును పిలుస్తారు. ఇక్కడి రైతులు ఎక్కువగా ఉద్యాన పంటలు సాగు చేస్తారు. చుట్టూ నదులు, అడవులు ఉన్నాయి. అయినా, ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంటోందని స్థానికులు అంటున్నారు. సాయంత్రం 6 గంటలైనా వేడి తగ్గడం లేదు. దీంతో ఉదయం 11 తర్వాత జనం రోడ్లపై కనిపించడం లేదు. ఫలితంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీధులు, ప్రధాన దారుల్లో జనాలు లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి.వ్యవసాయకూలీలతో పాటు, భవన నిర్మాణ కార్మికులు పనులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతు కూలీలు ఉదయాన్నే పనులకు వెళ్లి 11 గంటలకు పనులు ముగించుకుని వస్తున్నారు. పలువురు వేసవి తీవ్రత తాళలేక ఆస్పత్రి పాలు అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలక ప్రజలు చెట్ల వద్ద సేదదీరుతున్నారు. పండ్ల రసాలు, కొబ్బరి బోండాలకు డిమాండ్ పెరిగింది. దీంతో ఒక కర్బూజాకాయను రూ.100లకు విక్రయాలు చేస్తున్నారు. ఇంట్లో పెట్టిన టెంకాయలు కొట్టకుండానే ఎండ వేడిమికి పగులుతున్నాయి. ఇదే అదనుగా వ్యాపారుల శీతలపానీయాల ధరలు పెంచేశారు. కొబ్బరి నీరు ఒక బాటిల్ రూ. 150 లకు విక్రయిస్తున్నారు.

జాగ్రత్తగా ఉండాలి



వేసవి తీవ్రత నుంచి తప్పించుకోవడానికి తగినంత నీరు తాగాలి. మజ్జిగ, ఓఆర్ఎస్ సేవించాలి. ఎండకు తిరగరాదు. 11 గంటలు దాటిన తర్వాత, సాయంత్రం 5 గంటల లోపు బయట తిరగడం సాధ్యమైనంత వరకు నుంచి బయట తిరగరాదు.ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది. మజ్జిగ, నీరు, పండ్ల రసాలు తరచూ తీసుకోవాలి.

- బ్రహ్మకుమారి, ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యురాలు

వైభవంగా కనక రుద్రమ్మ తిరుణాల



పూజలందుకుంటున్న కనకరుద్రమ్మ, మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పుల్లంపేట, మార్చి 24: మండలంలోని దేవరకొండ గుట్ట వద్ద ఆదివారం కనకరుద్రమ్మ తిరుణాల నిర్వహించారు. అమ్మవారు తెల్లవారుజామునే పి.వి.జి.పల్లె నుంచి అమ్మవారు దేవరకొండ గుట్టవద్ద ఉన్న ఆలయానికి చేరుకున్నారు. రాజంపేట, రైల్వేకోడూరు, చిట్వేలి తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు సేవా సంఘాలు అన్నదానం చేశాయి. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభించారు. చాందినీ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాహనాలరద్దీ అధికంగా ఉండటంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయి భక్తులు ఇబ్బందులు పడ్డారు.

నాటుసారా స్వాధీనం

నిమ్మనపల్లి, మార్చి 24: గుటుచప్పుడు కాకుండా నాటుసారా విక్రయిస్తున్న భూదేవి(42) అనే మహిళను ఆదివారం ముష్టూరు పంచాయతీ దిగువపల్లిలో అదుపులోకి తీసుకుని 30లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు

రాజంపేట సీటును జనసేనకు కేటాయించాలి



మాట్లాడుతున్న రాజంపేట జనసేన నేతలు

రాజంపేట టౌన్, మార్చి 24: రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ సీటును జనసేన పార్టీకి కేటాయించాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని జన సేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజంపేట స్థానాన్ని జనసేనకు ఇవ్వాలని అధినేత పవన్‌కళ్యాణ్‌కు విన్నవించామన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి రాజంపేటలో సేవా కార్యక్రమాలతో పాటు, ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యంత చైతన్యవంతమైన నియోజకవర్గంగా పేరు గాంచిన రాజంపేటను జనసేనకు కేటాయిస్తే రాష్ట్రంలో అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. అత్యధిక ఓటు బ్యాంక్ కలిగిన నియోజకవర్గం కూడా రాజంపేటనే అన్నారు. ఈ కార్యక్రమంలో కోలాటం హరికృష్ణ, కత్తి సుబ్బరాయుడు, ఆకుల చలపతి, గురివిగారి వాసు, ఇడిమడకల సాయిశ్రీనివాస్, ప్రశాంత్, పలుకూరి శంకర్, బండ్ల రాజేష్, నంద్యాల హరి, ఏనుగుల మల్లి, గాజుల మల్లికార్జున, ముత్యాల చలపతి, పూల మురళి, నామాల శంకర, కోలాటం నరసింహ, రాజేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం



ప్రజలతో మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి

ఓబులవారిపల్లె, మార్చి 24 : ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా డాక్టర్ వైఎస్ హార్టికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు మండలంలోని సున్నపురాళ్లపల్లెలో ఆదివారం అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ నిశ్చల మాట్లాడుతూ ఏడు రోజులు కార్యక్రమంపై సవివరంగా తెలిపారు. డాక్టర్ సీహెచ్ రూత్ మాట్లాడుతూ బొప్పాయి, మామిడి, అరటి పంటలలో తెగుళ్ళ నివారణపై రైతులకు వివరించారు. డాక్టర్ రామయ్య, డాక్టర్ స్వరాజ్యలక్ష్మిలు మామిడిలో తేనెమంచు నివా రణ, పంటల కోత అనంతరం చర్యలు, సాంకేతిక పరిజ్ఞానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో సున్నపురాళ్లపల్లె రైతులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు..

ఆదిశంకరాచార్యుల మఠంలో అభిషేక పూజలు



పూజలు చేస్తున్న వేదపండితులు

రైల్వేకోడూరు, మార్చి 24: కొత్త కోడూరులోని ఆదిశంకరాచార్యుల మఠంలో ఆదివారం మండల అభిషేకాలు నిర్వహించారు. నవగ్రహ వాస్తు హోమాలు, రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చిందుకూరు నరసింహ శర్మ, కోశాధికారి సురేష్‌కుమార్, ప్రముఖ న్యాయవాది ఆర్‌సీ సురేష్‌బాబు, సతీష్‌కుమార్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సీనియర్లను బీజేపీ అధిష్టానం గుర్తించాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ సీనియర్‌నాయకుడు కృష్ణ

లక్కిరెడ్డిపల్లె మార్చి 24: ఎంతో కాలంగా బీజేపీకి సేవచేస్తూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న సీనియర్ నాయకులను అధిష్టానం గుర్తించాలని రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన నాయకులను వదిలేసి, నిన్నామొన్న పార్టీలోకి వచ్చినవారికి టిక్కెట్లు ఇస్తున్నారన్నారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో ఎంతో మంది సీనియర్లు పార్టీ బలోపేతానికి కృషిచేశారన్నారు. సీనియర్ బీజేపీ నాయకులను పొత్తులో ఉన్న టీడీపీ,జనసేన నాయకులు సైతం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు .ఎన్నికల ప్రచార సమయంలోనైనా సీనియర్ నాయకులను కలుపుకొని పోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు జయచంద్రనాయుడు, రెడ్డెన్న, రమణయ్య, వెంకటేసు, వేల్పుల శ్రీనివాసులు, విజయ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న 'లయన్స్' సభ్యులు

నందలూరు, మార్చి 24: మానవత స్వచ్ఛంద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ కుర్రామణి యాదవ్ మనవరాలు శ్రీలక్ష్మణ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పేదలకు అల్పాహారం పంపిణీని రైల్వే మెడికల్ సీనియర్ ఆఫీసర్ బస్సు జయభాస్కరరావు ప్రారంభించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి నరసింహులు, శ్యామనబోయిన గురుప్రసాద్, మోడపోతుల రాము తదితరులు పాల్గొన్నారు.

సంఘ సేవకుడు రాజాశరత్ జ్ఞాపకార్థం అన్నదానం



అన్నదానం చేస్తున్న రాజాశరత్‌బాబు మిత్రబృందం

రాజంపేట, మార్చి 24: సంఘ సేవకుడు రాజాశరత్‌బాబు దశదిన కర్మ సందర్భంగా ఆయన మిత్రబృందం పట్టణంలో ఆదివారం దాదాపు 2వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ మిత్రుడు రాజాశరత్‌బాబు జీవించి ఉన్నప్పుడు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాడని, ఆయన ఆశయాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి క్లబ్, మీసేవ అసోసియేషన్, రాజంపేట మున్సిపల్ కౌన్సిలర్ అన్నమయ్య జిల్లా వైసీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు సనిశెట్టి నవీన్‌కుమార్, బి. రాజేష్, విద్య, అవినాష్, ఏల్చూరు గుప్త, రాజా శ్రీనివాస్, శివ బాలాజీ, గుణిపూటి యశ్వంత్, నాగేంద్ర, బి.యశ్వంత్, జగన్, లక్ష్మయ్య, భరత్, నరసింహ, వినయ్, సుబ్రమణ్యం, చక్రంపేట బాబు, శరత్‌బాబు మిత్రబృందం పాల్గొన్నారు.

విజయానికి కలిసికట్టుగా కృషి చేస్తాం



సమావేశంలో మూడు పార్టీల నాయకులు

చిట్వేలి, మార్చి 24: రైల్వేకోడూరు నియోజకవర్గంలో పొత్తులో భాగంగా ఏ పార్టీకి టికెట్టు కేటాయించినా అందరం కలిసికట్టుగా విజయానికి కృషి చేస్తామని తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు ప్రకటించారు. ఆదివారం చిట్వేలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థి విజయానికి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజల సంతోషంగా ఉండాలంటే వైసీపీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠరావుపేట ఉరుసు ప్రారంభం



చాందినీతో అలంకరించిన సమాధులు

రామాపురం, మార్చి 24: మండలంలోని నీలకంఠరావుపేట సమీపంలోని సమర్థ సద్గురు దర్గాస్వామీజీ ఆశ్రమంలో హజరత్ దర్బార్ ఆలీషావలి రహమతుల్లా, అల్లైబాబా, గెలిల్ మస్తాన్ వలి బాబాగార్ల ఉరుసు ఆదివారం గంధం ఉత్సవంతో ప్రారంభమైనట్లు దర్గా స్వామీజీ భక్తుడు సత్యం స్వామి తెలిపారు. నీలకంఠరావుపేట నుంచి గంధం, చాందినీలు జెండా, పక్కీర్ల విన్యాసాలతో నీలకంఠరావుపేట నుంచి దర్గా వద్దకు చేరు కున్నాయి. దర్గా వద్ద బాబాగార్ల సమాధులకు గంధం చల్లి చాందినీతో అలంకరించారు

గంగమ్మకు ఘనంగా పూజలు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 24: మండలంలోని అనంత పురం గ్రామంలో ఆది వారం గంగమ్మకు పూజ లు నిర్వహించారు. జాతర ముగిసిన తర్వాత రెండో ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో బోనాలు సమర్పించారు. ఉదయం నుంచి జనం పోటెత్తారు భక్తులు ఇబ్బందులు పడకుండా చలువ పందిళ్ళు, తాగునీరు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా శ్రీచక్రానికి చక్రస్నానం

గుర్రంకొండ, మార్చి 24: మండలంలోని తరిగొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారి శ్రీచక్రానికి చక్రస్నానాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి ఆలయశుద్ధి, తోమాలసేవ, అర్చన, అభిషేకాలను చేశారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవ నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధికంగా భక్తులు వచ్చారు. కార్యక్రమంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ పార్టీగా గిరిజన యానాది సంఘాల మహాకూటమి

పీలేరు, మార్చి 24: రాష్ట్రంలోని గిరిజన యానాది సంఘాల మహాకూటమి త్వరలోనే రాజకీయ పార్టీగా అవతరించబోతున్నదని గిరిజన యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాపట్ల వెంకటపతి, పరమాల గోపీ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పీలేరులో గిరిజన యానాది మేల్కొలుపు సమావేశంలో మహాకూటమి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన యానాదులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ రాజకీయ సాధికారత లేకపోవడంతో రాజకీయ పార్టీగా అవతరించి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లా శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గిరిజన యానాది సేవా సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు జానం గంగిరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా గడ్డం శ్రీనివాసులు, కుప్పం రాజేశ్వరప్ప, ప్రధాన కార్యదర్శిగా గాలేటి వెంకటేశ్వర, కోశాధికారిగా గానుగపెంట సిద్దు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నచ్చుకూరి రెడ్డెప్ప, జాయింట్ సెక్రటరీగా ముత్యం తిరుపాల్, మీడియా సమన్వయకర్తగా జానం గంగిరెడ్డి ఎన్నికయ్యారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురిపై అదృశ్యం కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మార్చి 24: వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురిపై అదృశ్యం కేసులు నమోదు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. రూరల్ మండలం ఆర్‌సీ వడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప భార్య ఆదిలక్ష్మీ (35) ఈ నెల 22 నుంచి కన పడకుండా పోయిందని ఆమె భర్త ఫిర్యా దు మేరకు అదృశ్యం కేసును నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే మదనపల్లె పట్టణం గాంధీపురానికి చెందిన వెంకటరమణ భార్య అనిత(32) గత ఏడాది జూలై 4వ తేదీ నుంచి కనపడకుండా పోయిందని ఆదివారం ఆమె భర్త వెంకటరమణ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ వల్లిబస్సు ఆమెపై అదృశ్యం కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిమ్మనపల్లె మండలానికి చెందిన యువతి ఆదివారం అదృశ్యమైనట్లు సీఐ తెలిపారు.

లయన్స్‌క్లబ్ సేవలను వెలకట్టలేం

కలకడ, మార్చి 24: సమాజంలో లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలకు విలువకట్టలేమని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ వి.శ్రీకాంత్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం మదనపల్లెలో జరిగిన లయన్స్‌క్లబ్ రీజనల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కలకడ లయన్స్‌క్లబ్ సేవలను అభినందించారు. కలకడ లయన్స్‌క్లబ్ ఛైర్మన్ దగ్గుపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి సభ్యులుగా చేరడాన్ని స్వాగతిస్తున్నామని, ఆయన సహకారంతో హెల్త్ క్యాంపులు, సామాజిక సేవా కార్యక్రమాలకు విస్తృతం చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, సభ్యులు డాక్టర్ రామరాజు, పీఎం.రాజశేఖర్‌రెడ్డి, వీవీ కృష్ణారెడ్డి, భానుమూర్తిరెడ్డి, ముత్యాలు, బరకం శ్రీనివాసులురెడ్డి, మురళి, పునీత్‌చౌదరి, ఆనంద్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బడుగులను బలి తీసుకోవడమే న్యాయమా?

● తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 24: ఒక్క ఛాన్సు పేరుతో అధికారంలో వచ్చిన జగన్‌రెడ్డి బడుగులను బలితీసుకోవడమే పనిగా పెట్టుకున్నాడని ఇదేనా మీ సామాజిక న్యాయమంటూ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ప్రశ్నించారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో బీసీ చేనేత కుటుంబానికి చెందిన సుబ్బారావు మూడెకరాల భూమిని వైసీపీ నాయకులు లాక్కోవడంతోనే కుటుంబమంతా ఆత్మహత్య చేసుకోవడం దారుణమన్నారు. జగన్ పాలనలో బడుగు, బలహీన వర్గాల ఆస్తులకు రక్షణ లేదన్న విషయం చేనేత కుటుంబం బలవన్మరణంలో మరోసారి రుజువైందన్నారు. ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలు జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బీసీల మాన, ప్రాణాలకు రక్షణ కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు.

చేనేత కుటుంబానిది రాజకీయ హత్యే..

మదనపల్లె టౌన్, మార్చి 24: కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో చేనేత కార్మిక కుటుంబం పాల సుబ్బారావు, పద్మావతి, వినయల ఆత్మహత్య రాజకీయ హత్యేనని మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా ఆరోపించారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుబ్బారావు కుటుంబానికి చెందిన 3.14 ఎకరాల భూమిని వైసీపీ నాయకులు రెవెన్యూ అధికారులను లోబరచుకుని రికార్డులోకి ఎక్కించారన్నారు. చేనేత కుటుంబం ఆత్మహ త్యకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి, అవినీతి రెవెన్యూ అధికారులపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలనతోనే అనేక కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకున్నాయన్నారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షైపోర్సు మహేష్ మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు తేలేకపోయినా, కొకైన్ డ్రగ్స్ మాఫియా తిష్ట వేసేందుకు అనుకుల పరిస్థితులు కల్పించారన్నారు. టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్, నాయకురాలు దారం అనిత, టీడీపీ నాయకులు ఎస్‌ఏ మస్తాన్, రాటకొండ మధుబాబు, దొరస్వామినాయుడు, నాదెళ్ల శివన్న, షంషీర్, నాగూర్‌వలి, సోమశేఖర్, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల భూదాహానికే చేనేత కుటుంబం బలి

మదనపల్లె టౌన్, మార్చి 24: కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో వైసీపీ నేతల భూదాహానికే చేనేత కుటుంబం బలి అయిందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికారప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు ధ్వజమెత్తారు. ఆదివారం మదనపల్లెలో నిర్వహించిన పద్మశాలి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత కుంటుబానికి చెందిన పాల సుబ్బారావు, పద్మావతి, వినయ ఆత్మహత్యకు వైసీపీ నేతలే బాధ్యులన్నారు. ముగ్గురు ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేనేత సంఘం నేతలు వెంకటసుబ్బయ్య, శ్రీరాములు, మురళి, సుధాకర్, రెడ్డిశేఖర్, రెడ్డెప్ప, మధు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీటీసీ సహా పలువురు టీడీపీలో చేరిక

మదనపల్లె టౌన్, మార్చి 24: మండలంలోని కురవంక పంచాయతీలో వైసీపీ ఎంపీటీసీ హారతి, ఆమె భర్త కురబ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లె రెడ్డిప్రసాద్‌తోపాటు 100 మంది మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా షాజహాన్‌బాషా మాట్లాడుతూ వైసీపీ ఆరాచక పాలన చూసి ప్రజలు విసిగెత్తిపోయారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్ర భవిష్యత్ సాధ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కప్పల శ్రీరాములు, వార్డు సభ్యుడు నాగరాజు, రామకృష్ణ, సునీల్, విజయ్, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్ట్.. 30 లీటర్లు స్వాధీనం

నిమ్మనపల్లి, మార్చి 24: గుటుచప్పుడు కాకుండా నాటుసారా విక్రయిస్తున్న ఒకరిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి మండలం ముష్టూరు పంచాయతి దిగువపల్లికి చెందిన రమణ భార్య భూదేవి(42) గ్రామ సమీపంలో నాటుసారా విక్రయిస్తుండగా తన సిబ్బందితో దాడి చేసి ఆమెను అరెస్టు చేసి 30లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. త్వరలో ఎన్నికలు రానుండంతో పకడ్బందీగా తనిఖీలు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

● శంఖారావ సభలో జేఏసీ నాయకుల డిమాండ్

మదనపల్లె అర్బన్, మార్చి 24: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లె పట్టణంలోని వాల్మీకి శంఖారావ సభలో జేఏసీ అధ్యక్షుడు పొదల నరసింహులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లతరబడి వాల్మీకి కులస్థులు ఎస్టీ రిజర్వేషన్ కోసం పోరాటాలు చేస్తున్నా పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా వాల్మీకులకు న్యాయం జరిగేలా ఏ రాజకీయ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చి అమలు చేస్తారో ఆపార్టీకే రాష్ట్రంలోని వాల్మీకి కులస్థులు అందరూ మద్దతు ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ కో- ఛైర్మన్ ముత్తరాశి హరికృష్ణ, గౌరవాధ్యక్షులు సుదర్శన్‌బాబు, మేకల విజయమోహన, చీకలబైలు సర్పంచ్ మండ్యెం ప్రభాకర్, అర్జున్, జగదీష్, గోవిందు, మహిళలు భాగ్యమ్మ, గౌరమ్మ, కులపెద్దలు నారాయణ, కృష్ణప్ప, చావడి కిట్టన్న, తదితరులు పాల్గొన్నారు.

బానిస మనస్తత్వం వీడాలి

పీలేరు, మార్చి 24: బానిస మనస్తత్వం వీడి ప్రశ్నించే తత్వం అలవరుచుకోవాలని రాష్ట్రంలోని మాల ప్రజాప్రతినిధులకు పీలేరులోని మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. మాలమహానాడు పీలేరు శాఖ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మాల ప్రజాప్రతినిధులు చట్టసభల్లో ప్రశ్నించనందున రాష్ట్రంలోని మాలలకు అందాల్సిన అనేక పథకాలు రద్దయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పీలేరు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా గుండ్లూరు రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా బద్దె భానుప్రకాశ్, గౌరవ అధ్యక్షుడిగా మల్లేపల్లె చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా గుర్రం లోకనాథం, జెట్టి రాజశేఖర్, కార్యదర్శిగా టంగుటూరి శేషాద్రి, ప్రచార కార్యదర్శిగా ప్రభుతేజ, సహాయ కార్యదర్శులుగా దప్పేపల్లి ఆనంద్, ఎన్నికయ్యారు.

అన్ని పాఠశాలల్లో స్కౌట్స్ గైడ్స్ యూనిట్

మదనపల్లె అర్బన్, మార్చి 24: ప్రభుత్వ జిల్లా పరిషత్, ఏపీ మోడల్ స్కూల్స్‌తో పాటు అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి టి.నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక జీఆర్టీ హైస్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్స్‌కు ప్రారంభ కోర్స్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం బిగినర్స్ కోర్స్ శిక్షణానంతరం స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు బేసిక్ శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, రవీంద్రారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో జూనియర్ లెక్చరర్ మృతి

మదనపల్లె అర్బన్, మార్చి 24: మదనపల్లెకు చెందిన తెలుగు జూనియర్ లెక్చరర్ టి.నారాయణ ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబసభ్యుల వివరాల మేరకు వాయల్పాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో తెలుగుజూనియర్ లెక్చరర్‌గా నారాయణ విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం పట్టణంలోని దేవతానగర్ స్వగృహంలో బెడ్‌రూమ్ నుంచి ఎంతసేపటికి రాకపోవడంతో భార్య టి.జానకి అక్కడికి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడిఉండగా వెంటనే స్థానికుల సాయంతో జిల్లాప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ పరీక్షించిన డాక్టర్లు అప్పటికి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇతను తెలుగు పండిట్ యూనియన్ మదనపల్లె డివిజన్ గౌరావాధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నట్లు వారు తెలిపారు. ఇతనికి భార్య టి. జానకితోపాటు కొడుకు ఉమేష్‌చంద్, కుమార్తె హంపీలు ఉన్నారు. కాగా కుమార్తె హంపీ విదేశాల్లో ఎంబీబీఎస్ చదువుతున్నట్లు వివరించారు.

చంద్రబాబును కలసిన పెన్షనర్స్

మదనపల్లె, మార్చి 24: ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ, సీనియర్ సిటిజన్ నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును కలిశారు. విజయవాడ చేరుకున్న వారంతా ఆదివారం పార్టీ కార్యాలయంలో అధినేతో సమావేశమై సాధారణ, అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్ర పెన్షనర్స్‌పార్టీ, సీనియర్ సిటిజన్స్ అంతా టీడీపీకి మద్దతు తెలుపుతున్నట్లు ఆయా సంఘాల నేతలు ప్రకటించారు. ఇందుకు సంఘీభావంగా ప్రచారంలో పాల్గొననున్నట్లు వారు ప్రకటించడంపై అధినేత సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ పార్టీ అజెండా, సీనియర్ సిటిజన్స్ తమ సమస్యలను చంద్రబాబు ముందు వినతి పత్రం రూపంలో ఉంచారు. చంద్రబాబును కలసిన వారిలో ఆంధ్రపెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ పెద్దన్న, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మునిగోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మునెయ్య, వరదరాజులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు సంక్షేమం

తంబళ్లపల్లె, మార్చి 24: టీడీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు సంక్షేమం సాధ్యమని పార్టీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో బాగంగా ఆదివారం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కోసువారిపల్లె ఖస్బా, రెడ్డివారిపల్లె, నల్లతిమ్మారెడ్డిగారిపల్లె, చిన్నరెడ్డిగారిపల్లె, పెద్దతిమ్మారెడ్డిగారిపల్లెల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత కోసువారిపల్లె ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను కరపత్రాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకురాలు సిద్దమ్మ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సోముశేఖర్, బీఎంఆర్‌రెడ్డప్ప, క్రిష్ణమూర్తి, మదన, శివరాం, రవి, కృష్ణారెడ్డి ఆనంద్, వెంకట్రమణ, భరత్‌రాయల్, వెంకట్రమణారెడ్డి, సోముశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో టీడీపీని ఆదరించి గెలిపించండి

కలికిరి, మార్చి 24: ఎన్నికల్లో టీడీపీని ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని మహల్ పంచాయతీలో శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, కేవీ రెడ్డి, మాజీ సర్పంచులు మహ్మదాలీ, వెంకట్రమణ, మైనారిటీ విభాగం అధ్యక్షుడు మున్వర్ ఆలీ, ఐటీడీపీ అధ్యక్షుడు షబ్బీర్ హుస్సేన్, సతీష్ రెడ్డి, హరి, మనోహర, వెంకటేష్, మదనమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని అభిమాని పాదయాత్ర

పెద్దమండ్యం, మార్చి 24: రాష్ట్రంలో కూటమి విజయం సాధించి చంద్రబాబు సీఎం కావాలని ఎద్దమండ్యం మండలం వెలిగల్లుకు చెందిన టీడీపీ సీనియర్ నేత రామాంజులునాయుడు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. శనివారం ఆయన పాదయాత్ర పీలేరు సమీపంలోని భాకరాపేట ఘాట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో, తంబళ్లపల్లి లో టీడీపీ విజయం సాధించాలని తిరుమల వేంకటేశ్వర స్వామి వారిని కోరనున్నట్లు తెలిపారు.

సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ

రామసముద్రం, మార్చి 24: మండలంలోని ఆంధ్ర కర్ణాటక అనప్పల్లె కొత్తూరు, కురిజల చెక్‌పోస్టులను ఆదివారం మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టులో ప్రతి వాహనాన్ని తనిఖీ నిర్వహించి మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ విషయమై సీఐ, ఎస్ఐలకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో విమర్శలకు తావులేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. సీఐ సద్గురుడు, ఎస్ఐ చంద్రశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

మదనపల్లెలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

మదనపల్లె అర్బన్, మార్చి 24: పట్టణంలో పోలీసులు ఆదివారం టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నిమ్మనపల్లె సర్కిల్ నుంచి ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ కవాతు నిర్వహించారు. టూటౌన్, వన్‌టౌన్, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు యువరాజ్, వల్లిబస్సు, శేఖర్, ఎస్‌ఐలు వెంకటసుబ్బయ్య, రవికుమార్, వెంకటేష్, పోలీసులు పాల్గొన్నారు.

కలకడలో: ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కలకడ పట్టణంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎస్ఐ రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.